RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -147 పేజీలు - 04 వెల - 04/- శనివారం 4 జులై 2026

# ఎస్ఐఆర్ నిలిపేయండి..

**సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ**

**ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం**

**ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు**

**కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ**

**ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య**




**న్యూఢిల్లీ,జులై 3 ఆంధ్ర ప్రగతి**
దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల**మిగతా 2లో...**

# రాయలసీమలో ఉక్కు యుగం

**రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా మారుస్తా**






## జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం

**సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మాణం**

**సీమలో పారాల్సింది రక్తం కాదు..నీళ్లు**

**మావిగన్, విజయవాడ..రేపు మరేంటో**

**జగన్ తీరుపై పరోక్షంగా విమర్శలు**

**సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

**అమరావతి,జులై 3 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త పారిశ్రామిక హబ్‌గా, ముఖ్యంగా 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన**మిగతా 2లో...**






# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

**వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్**

**అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం**

**గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ**

**సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి**

**అమరావతిజులై 3 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. **2లో...**




# ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు..

**కేంద్రం ఉత్తర్వులు**

**నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం**

**మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం**

**కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు**



**న్యూఢిల్లీ,జులై 3 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు.
అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. **మిగతా 2లో...**

# అమరావతి అప్పుల భారం ప్రజలపైనే పడుతుంది: సజ్జల

**ఏపీ ఇప్పటికే లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందన్న సజ్జల**

**అమరావతి కోసం మరో రూ. 2 లక్షల కోట్ల భారం మోపితే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్న**

**ప్రభుత్వాన్ని వైసీపీ ప్రశ్నిస్తూనే ఉంటుందన్న సజ్జల**

**అమరావతిజులై 3 ఆంధ్ర ప్రగతి**
రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని... ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. **2లో...**



# లిఫ్ట్ ఇరిగేషన్‌కు పూర్వ వైభవం

**-పదేళ్ల నిర్వహణకు 4,500 కోట్లతో టెండర్లు.**

**-శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం.**

**జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

**జగ్గయ్యపేట, జులై 3 ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట నియోజకవర్గంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. 15 కోట్లతో అక్కడి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు,**మిగతా 2లో...**



# అప్పులపై అబద్ధాలు

**పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు**

**విమర్శలు గుప్పించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**


**సంగారెడ్డి,జులై 3 ఆంధ్ర ప్రగతి**
కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అప్పుల విషయంలో అబద్దాలు చెప్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ఐఆర్ పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు నాకు లేఖ రాశాడు. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,45,294 కోట్లు అని చెప్పాడు. నాలుగు నెల కిందనే నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అంత చెప్పాడు అంటే ఈ నాలుగు నెలలది కూడా కలిపితే రూ. 4 లక్షల**మిగతా 2లో...**



# రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

**ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తరహాలో అప్పగింత**

**ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం**




**అమరావతిజులై 3 ఆంధ్ర ప్రగతి**
రుషికొండ భవనాల విషయంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. హిల్‌టాప్‌లోని భవనాల నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటెస్ట్ ను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది.**మిగతా2లో...**

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

**యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి**

**యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు**

**న్యూఢిల్లీ,జులై 3 ఆంధ్ర ప్రగతి**
అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని**మిగతా 2లో...**



# ఎస్ఐఆర్ నిలిపేయండి..

**మొదటిపేజీ తరువాయి**

సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

**మొదటిపేజీ తరువాయి**

అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

### ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు..

**మొదటిపేజీ తరువాయి**

భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

## రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

లీజ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మోడల్‌లో రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించనుంది. ఎంపికైన ప్రైవేట్ సంస్థ.. ఐదు భవనాల సముదాయాన్ని నిర్వహించనుంది. మొత్తం 9.8 ఎకరాల హిల్‌టాప్ ప్రాజెక్టును మోడల్‌లో ప్రభుత్వం వినియోగించనుంది. రుషికొండ దిగువ ప్రాంతంలో ఉన్న మరో 9 ఎకరాల భూమి అభివృద్ధికి కూడా అవకాశం కల్పించనుంది. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీటీడీసీ తెలిపింది. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యూయింగ్ ఏరియాలు, ఓపెన్ స్పేస్‌లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు విధించింది. ప్రస్తుత భవనాలతో పాటు అదనపు అభివృద్ధికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు ఖాళీ స్థలాల్లో మొత్తం 2,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధికి అవకాశం ఉండగా, అదనంగా సుమారు 4,800 చదరపు మీటర్ల వరకు జీప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇవ్వనుంది. సీఆర్‌జెడ్ నిబంధనలు, చట్టబద్ధ అనుమతుల ప్రకారమే అన్ని నిర్మాణాలు చేపట్టాలని ఏపీటీడీసీ స్పష్టం చేసింది. పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రాజెక్టు వాణిజ్య సాధ్యాసాధ్యాలను ఇక్షవ ద్వారా అంచనా వేసి... అనంతరం ఆర్ఎఫ్‌పీ దశలో తుది ఎంపిక పక్రియ జరగనుంది. హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్లు, ఇన్‌ఫ్రాస్టక్చర్ కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది. హాస్పిటాలిటీ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకే అర్హత
కల్పించనున్నట్లు తెలిపింది. మార్చి 31, 2025 నాటికి పాజిటివ్ నెట్‌వర్త్ తప్పనిసరి అని పేర్కొంది. ఇక్షవ దాఖలుకు చివరి తేదీ జులై 10 సాయంత్రం 5 గంటలుగా నిర్ణయించారు. తుది లీజ్ నిబంధనలు, ఆదాయ భాగస్వామ్యం తదితర అంశాలను ఖీఈఖ దశలో ఖరారు చేయనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.

### అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

**మొదటిపేజీ తరువాయి**

అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# అప్పులపై అబద్ధాలు

**మొదటిపేజీ తరువాయి**

కోట్లు దాటుతుందన్నారు. జూపల్లి ఒక మాట చెబుతున్నాడు, రేవంత్ రెడ్డి ఇంకో మాట చెబుతున్నాడు. ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించాడు. పూటకో సవాల్.. రోజుకో అడ్రస్‌లా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశాం.. ఏమైందో అందరికీ తెలుసు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు అంటున్నారు. జూపల్లి వాట్సప్‌లో లేఖ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాళ్లు చేసిన అప్పులు లేఖలో రాశారు. తాము వచ్చాక రూ.1.77లక్షల కోట్లు అప్పు చేశామని జూపల్లే చెప్పారు. ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్‌ఆర్‌బీఎం అప్పులు మొత్తం చెబుతా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు. ఆర్‌బీఐ తెచ్చిన అప్పులోనే తేడాలు చెప్పారు. ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

# రాయలసీమలో ఉక్కు యుగం

**మొదటిపేజీ తరువాయి**

సభలో సీఎం మాట్లాడారు. రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా గ్రీన్ స్టీల్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కేవలం విశాఖపట్నం మాత్రమే కాకుండా, రాయలసీమ ప్రాంతాన్ని కూడా 'ఉక్కుసీమ'గా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో స్టీల్ ప్లాంట్ పేరుతో కొందరు ఐరన్ ఓర్‌ను దోచుకుంటూ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకువచ్చామని అన్నారు. అంతేకాదు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఇక్కడి యువతకే ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తీసుకురావడం వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయన్నారు. ఇప్పటివరకూ అక్కడ 19 లక్షల కార్లు తయారయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగింది, ఎవరి హయాంలో మంచి జరిగిందో ప్రజలు చరిత్రను ఒకసారి గుర్తుచేసుకోవాలని కోరారు. స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటుతో రాయలసీమ చరిత్రలో నవశకం మొదలైంది. రాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతా. రాయలసీమ అంటే కరవు నేల కాదు జలకళ కాబోతోందన్నారు. ఈ ప్రాంతం హార్టికల్చర్‌హబ్‌గా మారిపోయింది. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారింది. రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ అని చూపిస్తున్నాం. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో సీమకు అన్నీ మంచి రోజులే. రాయలసీమలో ఎ÷-లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూశాం. 2019 డిసెంబరులో ఒకసారి, 2023లో రెండోసారి భూమిపూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా.. చిన్న భవనమైనా కట్టారా? అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం, 1100 ఎకరాల భూమి ఇచ్చాం. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగనుంది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఎ÷-లాంట్‌తో ఏపీ.. ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు.. రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు
మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఒకప్పుడు రాయలసీమలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని అంతం చేశామని, సీమలో పారాల్సింది రక్తం కాదు.. సాగునీరు. ఫ్యాక్షనిజం పోయినప్పటికీ, నేరాలు చేసేవాళ్లు రాజకీయాల్లోకి రావడం దురదృష్టకరం అన్నారు. విధ్వంసమే అజెండాగా పెట్టుకున్న ఒక వ్యక్తి రాష్ట్రానికి ఏం చేయగలరు. 2014లో అమరావతిని రాజధానిగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు, అయితే అధికారంలోకి వచ్చాక.. మూడు రాజధానులంటూ నవ్వులపాలు చేశారు. మావిగన్, విజయవాడ అంటూ మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారు. రేపు ఇంకేమంటారో తెలియని పరిస్థితి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోంది. ఇలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం.' అని సీఎం తెలిపారు.

# లిఫ్ట్ ఇరిగేషన్‌కు పూర్వ వైభవం

**మొదటిపేజీ తరువాయి**

పది సంవత్సరాలు పాటు నిర్వహణ పనుల కోసం 4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు రామానాయుడు చెప్పారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18 వేల కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయాడన్నారు. పోలవరం డయాఫ్రమ్వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడు అయ్యాడు అన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసిపి 200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే 1200 కోట్లు ఖర్చు చేసినట్లు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా గొడ్డలి పార్టీ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలు మూత పడింది అన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయి అన్నారు. రాష్ట్రంలో 1023 లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. 2021 నుండి వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం పనిచేయపోవటానికి వైసిపి ప్రభుత్వ నిర్వాకమే కారణమని ఆయన అన్నారు. 15 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత పునరుద్ధరణ పనులు పూర్తి అయితే జగ్గయ్య పేట, నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించగలదన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణ కోసం, 5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని ఆయన గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంస మైందనడానికి ఐడిసినే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఉదహరించారు.

రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకో మాట అన్న చందంగా ఉంది ఆయన తీరు అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక, మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటాడారు అన్నారు. తెలంగాణకు హైదరాబాదు, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాలుగా ఉంటూ లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయన్నారు. అలాగే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా ముఖ్యమంత్రి రూపకల్పన చేశారన్నారు. ఫలితంగా ఏటా లక్ష కోట్లు రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. ఈ లక్ష కోట్లతో 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీఎండి తిరుమల రావు, కెడిసి సిఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# అమరావతి అప్పుల భారం ప్రజలపైనే పడుతుంది: సజ్జల

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచస్థాయి రాజధాని అన్న చంద్రబాబు ఇప్పుడు మున్సిపాలిటీ అంటున్నారు. రాజధానికి ప్రభుత్వ భూమి ఉంటే మంచిదని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి నేల రాజధానికి పనికిరాదని గతంలో చాలా మంది చెప్పారు. అమరావతి నేల కుంగిపోతుంది.. ఇది ప్రమాదకరం. అమరావతి పూర్తి చేయాలనే ఉద్దేశం చంద్రబాబుకు లేదు. వైఎస్ జగన్ అడిగిన ప్రశ్నలకు టీడీపీ నేతలు ఎక్కడైనా సమాధానం ఇస్తున్నారా? అంటూ సజ్జల ప్రశ్నించారు. 'మావిగన్‌లో తక్షణ అభివృద్ధికి అవకాశం ఉంది. అమరావతి అప్పుల భారాన్ని రాష్ట్రం మోయలేదు. రైతులు ఇచ్చిన భూముల్లో లే అవుట్‌లు కూడా అభివృద్ధి చేయడం లేదు. లే అవుట్‌లు అభివృద్ధి చేయలేకపోతే రైతుల పరిస్థితి ఏంటీ?. అమరావతి కోసం అప్పు తెచ్చిన రూ.47 వేల కోట్లతో మెడికల్ కాలేజీలు, మచిలీపట్నం పోర్టు, హంద్రీనీవా కాలువ పూర్తి చేయొచ్చు. పాఠశాలలు దేవాలయాలు మాదిరిగా ఉండాలి. ఇప్పుడు ఎలా ఉన్నాయి?. ఛత్తీస్‌గఢ్ నయా రాయ్‌పూర్‌లో ఎవరుంటున్నారు?. చదరపు అడుగుకు రూ. 20 వేల ఖర్చు ఏంటీ? ఎక్కడైనా ఉందా?. ప్రశ్నిస్తే గొంతు నొక్కుతున్నారు.. భయపెడుతున్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మావిగన్ అనగానే చంద్రబాబు ఉలిక్కిపడుతున్నారు. అమరావతికి, మావిగన్‌కు మధ్య తేడా ఏంటో వైఎస్ జగన్ పలుమార్లు చెప్పారు. దాని గురించే మరోసారి వైఎస్ జగన్ స్పష్టత ఇచ్చారు. చంద్రబాబు చెప్పున్న అమరావతి అసాధ్యమైనదని, దాంట్లో 10 శాతంతో మావిగన్ అవుతుందని చెప్పారు. మావిగన్ ఆలోచనతో చంద్రబాబుకు పడరానిచోట దెబ్బ పడుతోంది. మావిగన్ అనగానే.. గుంటూరు, విజయవాడ కూడా మావిగన్‌లో భాగమేనని చంద్రబాబు అంటున్నారు. అమరావతికోసం చంద్రబాబు పెట్టాలనుకుంటున్న రూ.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టే ప్రాంతంలో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ఉన్నాయా?. కానీ మావిగన్‌లో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ఉన్నాయి. ఇప్పటికే వెస్ట్రన్ బైపాస్ వచ్చింది. సహజంగానే అమరావతి అభివృద్ధి చెందుతుందని సజ్జల వివరించారు. ప్రభుత్వ భూమి అయితే రాజధానికి బెటర్ అని వైఎస్ జగన్ చాలా స్పష్టంగా చెప్పారు. అందరికీ అందుబాటులో రాజధాని ఉంటుందని ఆరోజు అన్నారు. అమరావతిలో అవినీతి, దోపిడీ, ఆర్థిక భారం.. ఈ అంశాలన్నీ చెప్పారు. రాష్ట్రంలో ప్రజల డబ్బును వృథా చేయొద్దన్నందుకు వైఎస్ జగన్‌పై పడుతున్నారు. మాట మార్చింది వైఎస్ జగన్ కాదు.. కూటమి నాయకులే. మూడు రాజధానుల ప్రతిపాదనలో అమరావతికీ చోటు ఉంది. అమరావతి ప్రాధాన్యతను తగ్గించలేదు. లెజిస్లేచర్ క్యాపిటల్‌గా ఆ ప్రతిపాదనలో చోటు ఉంది. పైగా రైతులకు మేలు చేసింది వైఎస్ జగనే. అమరావతిలో వర్టికల్ డెవలప్‌మెంట్ చేస్తున్నారు. భూమి ఉన్నప్పుడు వర్టికల్ డెవలప్‌మెంట్ ఎందుకు చేస్తున్నారు?. రూపాయి అయ్యే చోట వంద రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తున్నారు?. ఆ డిజైన్లకు ఎంత డబ్బు పెట్టినా అవుతుందా?. ఏ పనీ చేయకపోయినా రూ.47 వేల కోట్ల అప్పులు తెచ్చారు. రూ.60 వేల కోట్ల పనులు అప్పగించేశారు. ఈ రూ.47 వేల కోట్లతో పోర్టులు, రాయలసీమ లిఫ్ట్, మెడికల్ కాలేజీలు, వెలిగొండ నిర్వాసితుల సమస్య, పోలవరం నిర్వాసితుల సమస్య, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇవన్నీ కూడా పూర్తి చేయవచ్చని సజ్జల వివరణ ఇచ్చారు.

# గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయి

**కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన**

**అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం**

**శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు**

**దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ**



"గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి.

ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది.

దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏ
వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది.

వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 4 జులై 2026

# ఆదివారం నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం.

**..అధ్యక్షులుగా సందీప్ కుమార్,కార్యదర్శి గా మేడా చంద్రశేఖర్, కోశాధికారి గా సురేష్ ప్రమాణ స్వీకారం చేస్తారు.**

**..రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్ర రావు అతిధులుగా పాల్గొంటారు. -.నూతన కార్యవర్గంతో డాక్టర్ రవి కృష్ణ ప్రమాణస్వీకారం చేయిస్తారు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 04:**
నంద్యాల లయన్స్ క్లబ్ 2026 -27 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. అధ్యక్షులుగా ముదియనూర్ సందీప్ కుమార్,కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ లతో పాటు మిగిలిన కార్యవర్గంతో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ప్రమాణస్వీకారం చేయిస్తారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి,శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు అతిధులుగా పాల్గొంటున్నారు.



శుక్రవారం లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ తో పాటు గత సంవత్సర కాలంగా సేవలందించిన అధ్యక్ష కార్యదర్శులు సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకోబడిన సందీప్, మేడా చంద్రశేఖర్, సురేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ 1970 సంవత్సరంలో ప్రారంభించబడిందని, గత 56 సంవత్సరాలుగా నంద్యాల లయన్స్ క్లబ్ ప్రజలకు అనేక రకాల సేవా కార్యక్రమాల్ని నిరంతరంగా కొనసాగిస్తూ వస్తున్నదని అన్నారు. గత సంవత్సర కాలంగా నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా వ్యవహరించిన సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్ 100 సేవా కార్యక్రమాలను నిర్వహించి నంద్యాల లయన్స్ క్లబ్ ప్రతిష్టను ఇనుమడింప చేశారని అభినందించారు.
నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన సందీప్, చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ మాట్లాడుతూ రానున్న సంవత్సర కాలంలో లయన్స్ క్లబ్ తరపున సామాజిక సేవా కార్యక్రమాలు,దివ్యాంగులకు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు,పర్యావరణ,విద్య ,సాంస్కృతిక ,క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

# బ్యాంకు రుణాలు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశం.

**.అర్హులైన ప్రతి ఒక్కరికి రుణం అందించండి.**

**జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి.**

**జిల్లాలో తలసరి ఆదాయాన్ని రెండు నుండి మూడు లక్షలకు పెంచడమే లక్ష్యం.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 03:**
జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలు అందాలని, ముఖ్యంగా బలహీన వర్గాలు, రైతులు మరియు మహిళా సంఘాలకు రుణాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం), వివిధ బ్యాంకుల ప్రతినిధులు మరియు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజల తలసరి ఆదాయాన్ని ప్రస్తుతమున్న రూ. 2 లక్షల నుండి రూ.3 లక్షలకు పెంచడమే ఈ ఏడాది తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని, గడువు లోపల నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.
గడువుల విధింపు: వివిధ ప్రభుత్వ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను జూలై 10 మరియు ఈ నెల ఆఖరిలోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కెనరా బ్యాంక్, ఏపిజిబి, ఎస్.బి.ఐ బ్యాంకులు తమ పరిధిలోని దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని పేర్కొన్నారు.
చిన్న రుణాలకు సిబిల్ (సిబిల్) నిబంధనలపై అసంతృప్తి: లైవ్‌స్టాక్ (పశుసంవర్ధక), వ్యవసాయం తదితర రంగాల్లో రూ. 1 - 2 లక్షల వంటి చిన్న రుణాలకు కూడా బ్యాంకర్లు సిబిల్ స్కోర్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న వెనుకబడిన ప్రాంతాలలో, వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన పేద ప్రజల పట్ల బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించి, నిబంధనలలో అవసరమైన సడలింపులు (కూలింగ్ పీరియడ్) ఇవ్వాలని కోరారు.
కౌలు రైతులకు సంయుక్త బాధ్యత సంఘాల (జాయింట్ లయబిలిటీ (గ్రూప్స్) ద్వారా రుణాలు: కౌలు రైతులకు (సిసిఆర్‌సి కార్డు దారులు) మరియు స్వయం సహాయక సంఘాల (ఎస్.హెచ్.జి) మహిళలకు రుణాల పంపిణీపై సుదీర్ఘంగా చర్చించారు. ఒకే భూమిపై భూయజమాని, కౌలు రైతు ఇద్దరికీ సాంకేతికంగా రుణాలు ఇవ్వడంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలతో కౌలు రైతుల జాయింట్ లయబిలిటీ గ్రూపులను (జె.ఎల్.జి) ఏర్పాటు చేసి, జూలై 15 లోగా అర్హులకు రుణాలు అందేలా చూడాలని డిఆర్డిఎ, మెప్మా అధికారులను ఆదేశించారు.
మత్స్యకార రంగానికి చేయూత: ఈ ఏడాది జిల్లాలో మత్స్య సంపద పెంపకానికి (137 లక్షల స్పాన్ రేరింగ్) పెద్ద ఎత్తున టార్గెట్ నిర్దేశించుకున్నామని, కావున ఫిషరీస్ కార్డ్స్ ఉన్న వారందరికీ తగినన్ని రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు.
లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని, అలా చేరుకున్న బ్యాంకులకు ప్రభుత్వ నిధుల డిపాజిట్లు రూపంలో ప్రోత్సహిస్తామని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, మెప్మా పిడి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్, ఏపీఎంఐపి పిడి సుధాకర్ మరియు వివిధ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలి.

**..అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.**

**..పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి తీసుకొని రావాలి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 03**
అర్హులైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని గిరిజన సంక్షేమ, బీసీ, సాంఘిక , మైనారిటీ సంక్షేమ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల ప్రవేశాలు, సీట్ల భర్తీ, ఖాళీలు, అదనపు ప్రవేశాలపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రవేశాలు కల్పించాలని కలెక్టర్ సంబంధిత సంక్షేమ అధికారులను ఆదేశించారు. గిరిజన, బీసీ, సాంఘిక, గురుకులం, మైనార్టీ తదితర సంక్షేమ పాఠశాలల్లో మంజూరైన సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య, అదనంగా చేరిన విద్యార్థులు, ఖాళీల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. అధిక ప్రవేశాలు ఉన్న హాస్టళ్లు, తక్కువ ప్రవేశాలు ఉన్న హాస్టళ్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చోట సీట్ల సర్దుబాటు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..అన్ని శాఖల అధికారులు పరస్పరం సమీక్షించుకుని, వచ్చే వారం సమావేశం నాటికి ఖాళీల భర్తీ ప్రక్రియలో గణనీయమైన పురోగతి సాధించాలన్నారు. అదనపు మరుగుదొడ్లు, పారిశుద్ధ్య పనులు సహా అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనులన్నీ నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేసి విద్యాసంస్థలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. విద్యాసంస్థలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, చేపట్టిన మరమ్మతులు, కొత్తగా ఏర్పాటు చేసిన వసతుల గురించి స్పష్టంగా వివరించి, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి తీసుకొని రావాలన్నారు.సమావేశంలో సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# కడప ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణకు రంగం సిద్ధం.

**..రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నం సాకారం దిశగా అడుగులు.**

**..ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 03:**
రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మళ్ళీ మార్గం సుగమమైందని జమ్మలమడుగులో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసిందని జులై 3న అనగా శుక్రవారం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పనులను అధికారికంగా పునఃప్రారంభించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు.
ఈ సందర్భంగా స్థానిక నంద్యాల మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఎస్‌డబ్ల్యూ సంస్థతో కలిసి ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని . రెండు దశల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడితో (మొదటి దశ రూ. 4,500 కోట్లు, రెండో దశ రూ. 11,850 కోట్లు) ఈ కర్మాగారాన్ని నిర్మిస్తున్నామని . రెండు దశలు పూర్తయితే 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి జరగడమే కాకుండా, లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. పర్యావరణ హితమైన 'గ్రీన్ స్టీల్' ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించామని. సంప్రదాయ బొగ్గు ఆధారిత పద్ధతికి బదులుగా, పునరుత్పాదక ఇంధనంతో పనిచేసే 'స్క్రాప్ ఆధారిత ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నార. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన 1,100 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు, గండికోట నుంచి 2 టీఎంసీ ల నీరు, 40 కోట్లతో 12 కి.మీ మేర 4 లైన్ల రోడ్డు, ముద్దనూరు నుంచి రైల్వే లైన్ అనుసంధానం, మరియు విద్యుత్ సబ్ స్టేషన్ల వంటి భారీ మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. 2028 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పేరుతో కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందని, కనీస పనులు కూడా చేపట్టలేదు అన్నారు . మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి, ఐదేళ్లయినా అంగుళం పనులు ముందుకు సాగలేదని, పైగా అక్రమ మైనింగ్ మరియు నిధుల మళ్లింపుతో రాయలసీమ ప్రజల ఆశలను దెబ్బతీశారని అన్నారు . కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవతో, కడప జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడమే కాకుండా, స్థానికంగా పారిశ్రామికీకరణ వేగవంతం కానుందని తెలిపారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా బాధ్యతతో వ్యవహరించాలి.

**..ప్రజల నుండి సానుకూల స్పందన పెంచే విధంగా అధికారులు ప్రజలకు సేవలు అందించాలి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 03:** ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శుక్రవారం పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండల కేంద్రంలో ఒక నెల ఒక గ్రామం కార్యక్రమం 4 వ పర్యటన లో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు పరిష్కరించడం పై అధికారులు, సిబ్బందికి ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో అర్జీలు పరిష్కారం కావడంలేదని, అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలలో అధిక శాతం భూమికి సంబంధించినవే ఉన్నాయని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని పరిష్కారం దిశగా కృషి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు తుగ్గలి మండలంలో నిర్వహించిన 4 పీజిఆర్ఎస్ కార్యక్రమాల్లో మొత్తం 300 అర్జీలు రావడం జరిగిందని, అందులో 105 పరిష్కరించగలిగామని కలెక్టర్ తెలిపారు. రీ సర్వేలో ఎక్స్టెంట్ వేరియేషన్, 22ఎ సంబంధించిన అర్జీలు ఎక్కువగా రావడం జరుగుతోందని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. పరిష్కరించడానికి సమయం పట్టే వాటిని మాత్రం ప్రయారిటీలో (ప్రాధాన్యత క్రమంలో) పెట్టుకుని, వాటిని కూడా ఒక నెల లేదా ఒకటిన్నర నెలలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, డిఆర్డిఏ పిడి రమణా రెడ్డి, డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించిన

# ఎస్టిమేట్ లను త్వరితగతిన పంపించాలి.

**-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 03:** మన బడి మన భవిష్యత్తు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఎస్టిమేట్ లను త్వరితగతిన పంపాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మన బడి మన భవిష్యత్తు కార్యక్రమం మీద కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు, గోనెగండ్ల, ఆదోని, కల్లూరు, కోడుమూరు తదితర మండలాల్లో అధిక సంఖ్యలో ఎస్టిమేట్ లు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 308 పనులకు సంబంధించిన 436 ఎస్టిమేట్ లు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న ఎస్టిమేట్ లను త్వరితగతిన పూర్తి చేసి పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
టెలి కాన్ఫరెన్స్ లో సర్వ శిక్ష అభియాన్ పీవో లోకరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై పదోన్నతి పొందిన ఆరుగురు ఏఎస్సైలు.

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిసిన పదోన్నతి పొందిన పోలీసు అధికారులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 03:**
కర్నూలు జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఏఎస్సైలు ఎస్సైలు లు గా పదోన్నతి పొందారు.



**పదోన్నతి పొందిన ఎస్సైలు:**
శ్రీ షబ్బీర్ అహ్మద్, శ్రీ శ్యామసుందర్, శ్రీ ఆనంద్, శ్రీ ఉస్మాన్ బాషా, శ్రీ అబ్దుల్ కరీం, శ్రీ ఫైజుల్లా ఖాన్ లు కలిసి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందనలు తెలియజేశారు. పదోన్నతితో బాధ్యతాయుతంగా పోలీసు సేవలు అందిస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# దేశ రక్షణలో నేను.. నాభూమిని కాపాడండి..!

**..జమ్మూ-కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న తమ్మడపల్లి సైనికుడు భాష్యం మహేష్ వీడియో వైరల్.**

**..భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు.**

**..సీఎం,డిప్యూటీ సీఎం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జులై 03:** దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ దేశ రక్షణ కోసం సేవలందిస్తున్న ఓ సైనికుడు తన స్వగ్రామంలోని వ్యవసాయ భూమి విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తూ చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నంద్యాల జిల్లా మహానంది మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన సైనికుడు భాష్యం మహేష్ ప్రస్తుతం జమ్మూ-కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.తనకు తమ్మడపల్లి గ్రామ పరిధిలో ఉన్న 2.38 ఎకరాల వ్యవసాయ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వీడియో ద్వారా ఆరోపించాడు.
తాను దేశ రక్షణ బాధ్యతల్లో ఉండగా,స్వగ్రామంలో తన ఆస్తికి రక్షణ లేకుండా పోవడం బాధాకరమని మహేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.మహానంది మండల టిడిపి ఇన్‌చార్జి కంచెర్ల శివతో పాటు ఆయన అనుచరులు తన భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించాడు.
ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం లభించలేదని,తన కుటుంబ సభ్యులు కూడా ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నాడు.దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న తనలాంటి సైనికుడి ఆస్తికే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని కోరాడు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని,తన భూమిని కాపాడడంతో పాటు తన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి,తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సైనికుడు విజ్ఞప్తి చేశాడు. కాగా,ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతుండగా,దీనిపై సంబంధిత అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.

## ప్రజా దర్బార్ లో అర్జీలు స్వీకరించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.. అధికారులకు తక్షణ ఆదేశాలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 03:** నంద్యాల మంత్రిగారి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ నిర్వహించిన 'ప్రజా దర్బార్'కు విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ నేరుగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు . ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజల వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, వాటిని నిర్ణీత కాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎటువంటి జాప్యం లేకుండా ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మంత్రి ఫరూక్ హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ గడువు పెంచాలని ఎస్‌డీపీఐ వినతి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 03:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమం గడువును పొడిగించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరుతూ ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ నాయకులు ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ శివప్రసాద్ రెడ్డి , అర్బన్ తహసీల్దార్ సత్య శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు.ఎస్‌డీపీఐ అసెంబ్లీ అధ్యక్షుడు ఫాజిల్ దేశాయ్ మాట్లాడుతూ, నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు, రోజువారీ కూలీలు తదితర వర్గాల ప్రజలు దరఖాస్తు ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున గడువును పొడిగించాలని కోరారు. అలాగే గ్రామాలు, వార్డులు, సచివాలయాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఎస్ఐఆర్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అత్తర్ హుస్సేన్, రిజ్వాన్ ఆలం, వి. హనీఫ్, షరీఫ్, సుహేల్ పాల్గొన్నారు.

## ఈ-పంట నమోదుపై జగన్ దుష్ప్రచారం

### అబద్ధాలకు జగన్ అంబాసిడర్‌గా మారారు

### మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి,జూలై3 ఆంధ్ర ప్రగతి**

ఏపీలో ఈ-పంట నమోదుపై ప్రతిపక్ష నేత జగన్ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. అబద్దాలకు జగన్ అంబాసిడర్‌గా, అసత్యాలకు సాక్షి వేదికగా మారిందని ఆరోపించారు. రైతులను తప్పుదోవ పట్టించే కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, విష ప్రచారాలతో వాస్తవాలను దాచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఖరీఫ్-2025 సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 53.32 లక్షల మంది రైతులకు చెందిన 117.39 లక్షల ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయ్యిందని మంత్రి తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నమోదుతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో ఈ-పంట నమోదు గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. అలాగే రబీ 2025-26 సీజన్‌లో 99.7 శాతం ఈ-పంట నమోదు పూర్తి చేయడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ంఖంఎఓ÷ూ 2.0 ద్వారా డిజిటల్ ఈ-పంట నమోదులో సాంకేతిక విప్లవం తీసుకొచ్చాం. కృత్రిమ మేథస్సు, జియో-రెఫరెన్సింగ్, ఉపగ్రహ సాంకేతికత వంటి ఆధునిక విధానాలతో పారదర్శకంగా ఈ-పంట నమోదవుతోంది. రైతులకు సబ్సిడీలు, పంట బీమా, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు వేగంగా అందించాలనే లక్ష్యంతో డిజిటల్ క్రాప్ సర్వేను అమలు చేస్తున్నాం. ఈ విధానం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను చూసి జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కొబ్బరి ధరల అంశంలో కూడా సాక్షి తప్పుడు కథనాలను ప్రచారం చేస్తోంది. ఇలాంటి వార్తలతో కొబ్బరి మార్కెట్‌ను దెబ్బతీయాలనే కుట్ర జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు ప్రచారాలతో మార్కెట్‌ను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు.

## డిజిటలైజేషన్‌లో జాప్యం తగదు

### : ఈఆర్వో చల్లా ఓబులేసు

### ఎస్ఐఆర్ ప్రక్రియలో రోజువారీ లక్ష్యాలను పెంచుకోవాలి

### జూలై 14లోపు ఎన్యూమరేషన్, డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశం



**కర్నూలు ఆంధ్ర ప్రగతి జూలై 3)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా స్వీకరించిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని వెంటనే డిజిటలైజేషన్ చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బీఎల్‌వోలను ఆదేశించారు.

ఆయన 17వ పోలింగ్ కేంద్రం పరిధిలోని అశోక్‌నగర్ కే.సీ. కెనాల్ బండ్ ప్రాంతంలో ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం బీఎల్‌వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రోజువారీ లక్ష్యాలపై సమీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ గడువు సమీపిస్తున్నందున ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను పెండింగ్‌లో ఉంచకుండా, వీలైనంత వరకు ఓటరు వద్దే డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.ఇంకా పంపిణీ చేయాల్సిన ఎన్యూమరేషన్ ఫారాలు ఉంటే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏల సహకారంతో సంబంధిత ఓటర్లను గుర్తించి వెంటనే పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి బీఎల్‌వో రోజువారీ లక్ష్యాలను పెంచుకుని, జూలై 14 గడువులోపు ఎన్యూమరేషన్‌తో పాటు డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తిచేసి ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు.అత్యల్ప శాతంలో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ఉన్న బీఎల్‌వోలపై సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు.

## పులిమద్ది ప్రభుత్వ పాఠశాలలో 11 మంది

# బోగస్ విద్యార్థుల నమోదు.!

...నిన్న ఒక్క విద్యార్థి...నేడు నలుగురు విద్యార్థులు.

..ఆ విద్యార్థులకు యూనిఫాం,పుస్తకాలు ఎక్కడ.

..బోగస్ విద్యార్థుల హాజరుతో ప్రభుత్వ నిధుల దోపిడి.

..మధ్యాహ్న భోజనం,కోడి గుడ్లు స్వహాచేస్తున్నారా.

...విద్యాశాఖ అధికారులు తనికీలు నిల్.

..వార్త వస్తేనే అధికారుల తనికీలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జులై 03:**

నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 11 మంది బోగస్ విద్యార్థుల నమోదు బట్టబయలైంది.ప్రభుత్వ బడి దోపిడి గుట్టు రట్టయింది.పాఠశాలకు విద్యార్థులు రాకపోయినా వచ్చినట్టు హాజరు పట్టికలో నమోదు చేస్తూ ప్రభుత్వ నిధులు దోపిడి చేస్తున్నట్టు తెలుస్తోంది.విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ బడుల్లో ఇష్టారాజ్యంగా విద్యార్థుల హాజరు లేకపోయినా ఉన్నట్టు చూపిస్తూ కొన్ని ప్రభుత్వ బడుల్లో దోపిడి సాగిస్తున్నారు.విద్యా శాఖ అధికారులకు తెలియకుండా ఏమి జరగదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ బడుల్లో ఎన్నేళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా పాపం పండి బట్టబయలైంది.రోజు హాజరు పట్టిక లో 14 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు నమోదు చేస్తున్న రోజు ఒక్క విద్యార్థి మాత్రమే వస్తున్నట్టు తెలుస్తోంది.మిగతా 13 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చినట్టు హాజరు వేసి వారికి ప్రభుత్వం ఇచ్చే కోడి గుడ్లు,మధ్యాహ్న భోజనం,పుస్తకాలు,యూనిఫాం ఎక్కడికి పోయాయో ఆ అధికారులకే తెలియాలి.ఒక్క గ్రామం లోనే ఇంత దోపిడి జరుగుతుంటే నంద్యాల నియోజకవర్గంలోని ఉన్న బడుల్లో హాజరు పట్టి లో ఉన్న విధంగా విద్యార్థులు వస్తున్నారో,బోగస్ లెక్కలు చూపిస్తూ దోచుకుంటున్నారో తెలియాల్సి ఉంది.పాఠశాలలో పని చేసి ఉపాధ్యులతో పాటు,విద్యా శాఖ అధికారులపై కూడా శాఖా పరమైన చర్యలు తీసుకుంటే కానీ మరో సారి ఇలాంటి




సంఘటనలు చోటు చేసుకోవు.వివరాల్లోకి వెళితే నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది.ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేరే విధంగా వారికి మధ్యాహ్న భోజనం,కోడి గుడ్లు,పుస్తకాలు,యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పిస్తుంది.గతంలో ఆ పాఠశాలలో విద్యార్థులు బాగానే ఉన్నట్టు తెలుస్తోంది.పాఠశాలలకు ప్రభుత్వం పలు పథకాలు ఇస్తున్నా విద్యా శాఖ అధికారులు పర్యవేక్షణ కరువు కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గు ముఖం పడుతుంది.ప్రవేటు పాఠశాలల్లో కేవలం 8 వేలు జీతం తీసుకుంటున్న ఉపాధ్యులు తమ,తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగటానికి ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్య పెంచుతున్నారు.ప్రభుత్వ బడుల్లో మాత్రం లక్షల జీతాలు తీసుకుంటూ విద్యార్థుల సంఖ్య పెంచడంలో నిర్లక్షం వహిస్తున్నారు.ప్రస్తుతం ఉండే విద్యార్థులు సైతం ప్రభుత్వ బడులకు రామ్,రామ్ చెపుతూ ప్రవేటు పాఠశాలల్లో చేరుతున్నారు.ఈ నేపధ్యంలోనే పులిమద్ది ప్రభుత్వ పాఠశాలలో మీడియా మిత్రులు పర్యటనలో ఆసక్తికరమైన దోపిడి బట్టబయలు చేశారు.పాఠశాలలో 14 మంది విద్యార్థులు ఉన్నట్టు హాజరు పార్టీలో ఉన్నా అక్కడ ఉండేది ఒక్క విద్యార్థి ఉండడం సంచలనంగా మారింది.ప్రచార మాధ్యమాల్లో వార్త రావడంతో విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ బడిని సందర్శించారు.అధికారులు వస్తున్నారని మరో విద్యార్థులు ప్రత్యక్షం కావడం విశేషం.ప్రస్తుతం హాజరు పార్టీలో 14 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆయన తనకి లో వెలుగుచూసింది.ఎన్నాళ్ళ నుంచి ఈ తతంగం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి.విద్యార్థులకు ఇచ్చే మద్యహనబోజనం,కోడి గుడ్లు,యూనిఫాం,పుస్తకాలు సైతం గుట్టుగా ఇన్నాళ్లు దోపిడి చేస్తున్నట్టు తెలుస్తోంది.ఉన్నత అధికారులు లైట్ గా తీసుకోకుండా దోపిడి నీ లోతుగా దర్యాప్తు చేసి,పాఠశాలలు తనికీలు చేయని విద్యా శాఖ అధికారులపై సైతం శాఖాపరమైన చర్యలు తీసుకుంటే కానీ సమస్య పరిష్కారం కాదు.మరో విశేషం ఏమంటే ఈ రోజు పులిమద్ది కి వెళ్ళినా పాత్రికేయులు కొందరిని విద్యా శాఖ అధికారి కాసేపు మాట్లాడి బయటకు వెళ్లి పొమ్మని చెప్పడం విశేషం.నంద్యాల నియోజకవర్గంలో ఇలాంటి దోపిడి ఎన్ని ప్రభుత్వ బడుల్లో జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి.ఉన్నతాధికారులు ఎప్పుడైనా ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే తనికీలు చేయకుండా విధిగా తనికీలు చేస్తే ఇలాంటి సంఘటనలు జరగవని మేధావులు పేర్కొంటున్నారు.


## జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరేనా..?

### .. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా ఇళ్ల స్థలాల ప్రక్రియలో ముందడుగు లేదని ఆవేదన.

### ..పెండింగ్ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని మీడియా ప్రతినిధుల విజ్ఞప్తి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 03:**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఇళ్ల స్థలాల అంశం నంద్యాల జిల్లాలో మరోసారి చర్చనీయాంశంగా మారింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కూడా ఈ అంశంలో స్పష్టమైన పురోగతి కనిపించకపోవడంపై పలువురు మీడియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో అది నిలిచిపోయిందని మీడియా వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అనంతరం ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఆ ప్రక్రియ తిరిగి ప్రారంభం కాకపోవడంతో అర్హులైన జర్నలిస్టులు ఎదురుచూపులు కొనసాగిస్తున్నారని




చెబుతున్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ప్రజాప్రతినిధులు గతంలో పలుమార్లు పేర్కొన్న నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని త్వరితగతిన పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉన్నందున సంబంధిత శాఖలతో సమన్వయం చేసి,ఇళ్ల స్థలాల ప్రక్రియపై స్పష్టత తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇదిలా ఉండగా,జర్నలిస్టు సంఘాలు కూడా ఈ అంశంపై మరింత చొరవ చూపాలని కొందరు మీడియా ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు .ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిపత్రాలు సమర్పించడం,సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించడం,పెండింగ్ ఫైల్ పురోగతిపై నిరంతరంగా ఫాలోఅప్ చేయడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే పాత్రను పోషించే జర్నలిస్టుల సంక్షేమాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని మీడియా వర్గాలు కోరుతున్నాయి.ఇళ్ల స్థలాల కేటాయింపుకు సంబంధించిన ప్రక్రియ ఏ దశలో ఉందో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించి, అర్హులైన జర్నలిస్టులకు త్వరితగతిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం, సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమై పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపితే జర్నలిస్టుల్లో నెలకొన్న అనిశ్చితికి తెరపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## విశాఖ స్టీల్ ప్రమాద మృతులకు అశ్రునివాళి.

..విశాఖ స్టీల్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని,కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలి.

..నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన.

..కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 03:**

విశాఖ స్టీల్ ఎస్ఎంఎస్ దుర్ఘటనలో 10 మంది కార్మికులను కోల్పోవడం బాధాకరం. ఇటువంటి దుర్ఘటన గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది ప్రమాదం కాదు. ప్రభుత్వ వైఫల్యం. మానవ తప్పిదం. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల దుష్ఫలితం. విశాఖ స్టీల్ ప్రమాద మృతులకు న్యాయం చేయాలని కోరుతూ, విశాఖ స్టీల్ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. గాయపడిన వారికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలి. న్యాయ విచారణ జరిపి । దోషులను శిక్షించాలి. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ను పాటించాలి. నాణ్యమైన రామెటీరియల్ను ఉపయోగించాలి. నాశిరకం మెటీరియల్ను కొనుగోలు చేసిన వారిని గుర్తించి శిక్షించాలి. భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు కే మహమ్మద్ గౌస్ ఏ ఐ టియు సి పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు అధ్యక్షులు వి.యేసు రత్నం, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు సిఐటియు జిల్లా కార్యదర్శి డి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి పి వెంకట లింగం,ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ధనుంజయుడు, ఐ ఎఫ్ టి యు డివిజన్ కార్యదర్శి చౌడప్ప వీరితోపాటు కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు 100 మంది పాల్గొనడం జరిగింది.అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే రామాంజనేయులు, ఐ ఎఫ్ టి యు డివిజన్ కార్యదర్శి చౌడప్పలు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఘటన ను పరామర్శించడానికి వచ్చిన మంత్రివర్యులు లోకేష్ కార్మికులకు పరిహారంపై అడిగినప్పుడు మీ ఇంట్లోవారు చనిపోయారా? అంటూ వ్యంగ్యంగా మాట్లాడ్డం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ మీడియా ముందు విలేకరుల ప్రశ్నకు జరిగిన దుర్ఘటనపై నాకు అంత అవగాహన లేదంటూ మాట్లాడ్డం సరైనది కాదని,ఇంత పెద్ద ప్రమాదం జరిగితే తక్షణమే ప్రాథమిక విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి. కానీ హుటాహుటిన తరలి వచ్చిన పెద్దలు ఎవరిని కాపాడేందుకో కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు.ఆ కమిటీ నిష్పక్షపాతంగా కార్మిక సంఘాలతో, కార్మికులు, అధికారులతో విస్తృతంగా సంప్రదింపులు జరుపుకుండా వెళ్లిపోయింది. అసలు దోషులు ఎవరని ప్రశ్నించారు.రూ.11440 కోట్లు ప్రకటించి అధికారాలన్నీ తమ చెప్పు చేతుల్లోకి తీసుకొని, ప్రధానమైన మెయింటెనెన్స్ పనులకు ఒక రూపాయి కూడా కేటాయించని పీఎంఓ దా? అన్ని తానై నడుపుతున్న । స్టీల్ సెక్రటరీదా? స్టీల్ ప్లాంట్ ను మూసేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ప్లాంటును నడిపిస్తున్నారని ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు కార్మిక వర్గం అంతా సిద్ధంగా ఉందని రాబోయే కాలంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి.

**."వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా మహానందిలో ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక.**
**.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**
**..ప్రత్యేక పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం.**
**..ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి మహానంది, జులై 3:**
అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.
శుక్రవారం మహానంది మండలంలోని కమ్మ సత్రం నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లతో కలిసి "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున అధికారులు ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.
తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.
ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై నిరంతర సమీక్ష ఉంటుందన్నారు.
శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన గ్రీవెన్స్ వ్యవస్థను ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలిగిందన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు.**

1)మహానంది మండలం, బొల్లవరం గ్రామానికి చెందిన ఉమ్మడి వెంకటస్వామి బొమ్మవరం గ్రామ పొలిమేరలోని సర్వే నెంబర్ 44 లో 1.5 సెంట్ల భూమిలో టీజీపీ కాలువ పోయిందని అధికారులు చెప్పడం జరిగింది కానీ ఈ భూమిలో పిజిపి కాలువ పోలేదు సర్వే చేసి నా భూమి నాకు ఉండేటట్లు చూడాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
2) మహానంది మండలం, మహానంది గ్రామానికి చెందిన జి వెంకటరమణ మేము ముగ్గురం కుటుంబ సభ్యులము మా అమ్మ చనిపోయింది. మా నాన్న మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయాడు మాకు ఎవరూ దిక్కులేరు. ఉండటానికి ఇల్లు కూడా లేదు దయచేసి మాకు ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
3) మహానంది మండలం, యు.బొల్లవరం గ్రామానికి చెందిన కే.మోహన్ సర్వే నంబర్ 232లో 95 సెంట్ల భూమి నా పేరు మీద ఉంది. ఈ భూమి రీ -సర్వే చేసిన తర్వాత 29 సెంట్లు ఇతరుల పేరు మీద ఎక్కించడం జరిగింది. రెవెన్యూ అధికారులు ఈ సమస్యను గుర్తించి నా భూమి నాకు ఇప్పించాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో విశ్వనాథ్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అబ్బిపురం చెంచు గిరిజన కాలనీ ఐటీడీఏలో చేర్చాలి.

**..మహానంది మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలి.**



**ఆంధ్ర ప్రగతి మహానంది 03:**
మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో గత దశాబ్దాలుగా నివాసముంటున్న చెంచు గిరిజనులను గుర్తించి ఐటీడీఏలో చేర్చాలని. జిల్లాలో చెంచు గిరిజనులకు ఎఅటీ పైన సరైన అవగాహన లేకపోవడం వల్ల వారికి మినహాయింపు ఇచ్చి వారి ఓట్లను తొలగకుండా చూడాలని. మహానంది మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మహానందిలో జరిగిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ రాజ్ కు మారి గణియా కి శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి గార్లకు డిమాండ్ తో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి లక్ష్మణ్. అద్దిపురం గ్రామ శాఖ కార్యదర్శి చెంచు లక్ష్మయ్య మండల సహాయ కార్యదర్శి శ్రీనివాసులు సిపిఐ మండల నాయకులు షేక్ దస్తగిరి గురుమూర్తి అబ్బి పురం గ్రామ చెంచు గిరిజనులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు మాట్లాడుతూ.. మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో చెంచు గిరిజన ప్రజలు గత 15 సంవత్సరాలుగా అనేక ఇబ్బందులతో నివసిస్తున్న చెంచు కాలనీని. ఐ టి డి ఎ లో చేర్చి మరియు వారికి సర్ ఓట్లపై అవగాహన లేనందున జిల్లాలో ఉన్న చెంచు గిరిజనులతో పాటు మహానంది మండలంలో నివసించే చెంచు గిరిజనులకు మినహాయింపు చేసే విధంగా 20 24 వ సంవత్సరంలో వేసిన ఓట్లను అలాగే కంటిన్యూ. చేయాలని. తిమ్మాపురం మోడల్ స్కూల్ కాంపౌండ్ వాల్ కు నిధులు మంజూరు చేయాలని. శ్రీనగరం వయా జమాలయ్య దర్గా తిమ్మాపురం వరకు ఉన్న రోడ్డును మరమ్మత్తులు చేయాలని మహానందిలో ఉన్న మోడల్ కాలనీకి మంచినీటి కొళాయి మంజూరు చేయాలని. మహానంది మండలంలో ప్రభుత్వ పురంబోకు భూములు వేలాది ఎకరాలు ఉన్నాయి వాటిలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ. గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వవలసినదిగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ విన్నవించడం జరిగిందని అధికారులు అధికార పార్టీ నాయకులు పై సమస్యలు పరిశీలించి అమలయ్యే విధంగా చూడాలని పై నాయకులు తెలిపారు.

# జిల్లా అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు భాగస్వామ్యం కావాలి.

**..ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా పాత్ర ఎంతో కీలకం. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**






**నంద్యాల, జులై 03 : ఆంధ్ర ప్రగతి**
జిల్లా అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా అభివృద్ధిపై సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... నంద్యాల జిల్లాలో అతి పురాతనమైన పుణ్యక్షేత్రాలు అహోబిలం, నవనందులు, యాగంటి, మహానంది, ఓంకారం, శ్రీశైలం, అహోబిలం, మద్దిలేటి స్వామి టెంపుల్, నందవరం చౌడేశ్వరిదేవి టెంపుల్, కొత్తూరు సుబ్బరాయుడు టెంపుల్ వంటి అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. మన పుణ్యక్షేత్రాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొనే విధంగా సోషల్ మీడియా ప్రమోట్ చేయాలన్నారు.
నంద్యాల జిల్లాలో 49 వేల పైచిలుకు హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ముఖ్యంగా ఖర్జూరం, ఆపిల్, డ్రాగన్ ఫ్రూట్స్ జిల్లాలో ప్రయోగాత్మకంగా సాగు చేయడం జరుగుతుందని వీటి మీద కూడా సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్
ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ అప్రోచ్ లో హార్టికల్చర్ అగ్రికల్చర్, పశుసంవర్ధక శాఖ మరియు
ఫుడ్ ప్రాసెసింగ్ కు సంబంధించిన యాక్టివిటీస్ పై అవగాహన కల్పించాలన్నారు.
జిల్లాలోని వెలుగోడు రిజర్వాయర్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గురించి ప్రమోట్ చేయాలన్నారు.
నంద్యాల జిల్లాలో ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దేందుకు సోషల్ మీడియా కృషి చేయాలన్నారు. ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు పొల్యూషన్ నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఒకసారి ఇంటి పై కప్పులపై సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 25 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికి అమ్మవచ్చు
కరెంటు పోతుందనే టెన్షన్ ఉండదు పీఎం సూర్య ఘర్ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.
నంద్యాల జిల్లాలో 4,లక్షల మంది స్వయం సహాయక సంఘ సభ్యులు ఉన్నారని వీరి చేతివృత్తులను ప్రజల్లోకి తీసుకెళ్లి వీరికి మరింత జీవనోపాధి కలిగించే విధంగా సోషల్ మీడియా ప్రచారం చేయాలన్నారు.
నంద్యాల జిల్లాలో రాంకోస్ సిమెంటు ఫ్యాక్టరీ విస్తరణ పనులు మరియు అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ లాంటి మెగా ఫ్యాక్టరీల వలన జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.
జలధార జల హారతి మరియు వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రీమియర్ ద్వారా వచ్చే ఫలితాలను కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రధానమంత్రి ప్రసంసించిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లను తదితర ఫుడ్ డ్రస్సింగ్ యూనిట్లను మరియు నల్లమల హనీని, నన్నారిని పాండురంగాపురం జిప్ బ్యాగుల పై ప్రజలకు అవగాహన కల్పించాలి.

**ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను జీవితశైలిగా మార్చుకోవాలి**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని పరిశుభ్రతను జీవితశైలిగా మార్చుకునేటట్లు సోషల్ మీడియా అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రత అనేది ఒక్కరోజు లేదా ఒక్క నెలలో జరిగే కార్యక్రమం కాదని, అది ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా మారాలని తెలిపారు. మన రాష్ట్రాన్ని, జిల్లాను, మండలాన్ని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోగలమన్నారు. పరిశుభ్రత లోపిస్తే అనేక ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఎదురవుతాయని పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా, సోషల్ మీడియా ప్రచారం చేయాలన్నారు. నంద్యాల జిల్లాను రాష్ట్రంలోనే జ అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు మన జిల్లా యొక్క ప్రగతి గురించి సోషల్ మీడియా ద్వారా ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్.తెలిపారు.

## ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

**శంగవరపుకోటలో వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు**

**రాష్ట్ర అభివృద్ధికి కీలకం అన్న హోంమంత్రి అనిత**


**విజయనగరంజులై 3 ఆంధ్ర ప్రగతి** ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. శుక్రవారం జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం – తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు. ఎస్.కోట నియోజకవర్గం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో ఎర్ర బస్సు రానిచోట, ఎయిర్‌పోర్టు ఎలా వస్తుందని జగన్ అన్నారని.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి గతంలో వలసలు వెళ్లేవారని.. ఇప్పుడు ఉత్తరాంధ్రకే వివిధ ప్రాంతాలవారు వలసలు వచ్చే పరిస్థితి ఉందని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, ఎమ్మెల్సీలు రఘురాజు, శ్రీనివాస్ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, అధికారులు హాజరయ్యారు.

----

## అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

**హెచ్చరించిన వాతావరణ శాఖ**

**విశాఖపట్టణం,జులై 3 ఆంధ్ర ప్రగతి**



ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

---------

## విదేశీ పేరున్నంత మాత్రాన హిందువు కాదంటే ఎలా

**మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు**

**చెన్నై,జులై 3 ఆంధ్ర ప్రగతి**
మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు హుకుం జారీ చేసింది.

